TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 90 | ఆదివారం, జూలై 28, 2024 | కంప్లమెంటరీ కాపీ | పేజీలు : 4

### అక్బరుద్దీన్ కు రేవంత్...

## బంపర్ ఆఫర్

హైదరాబాద్ జూలై, 27 : పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణాన్ని చేపడుతామని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయంలో చాంద్రాయణగుట్టకు వచ్చి కాంగ్రెస్ పార్టీ కోసం ఓట్లు అడుగుతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ అక్బరుద్దీన్ ఒవైసీని వచ్చేసారి కొడంగల్ నుంచి పోటీ చేయించి గెలిపిస్తానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయనకు కొడంగల్ బీఫామ్ ఇచ్చి.. దగ్గరుండి నామినేషన్ వేయిస్తానని..



గెలిపించి ఉపముఖ్యమంత్రిని చేస్తానన్నారు. కాగా,అంతకు ముందు ఎంఐఎం అక్బరుద్దీన్ అసెంబ్లీలో మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని పాతబస్తీ ప్రాంతానికి మెట్రో రైలును విస్తరించాలని డిమాండ్ చేశారు.

తమతో తొమ్మిదేళ్ల పాటు కలిసి ఉన్న కేటీఆర్ తెస్తున్నాం.. తెస్తున్నాం అంటూ కాలయాపన చేశారు తప్పా ఏనాడూ ముందడుగు వేయలేదని అసహనం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మెట్రో హైదరాబాద్‌కు మెట్రో కావాలని తానే డిమాండ్ చేసినట్లు గుర్తుచేశారు. దీని కోసం ఆనాడు ముఖ్యమంత్రితో కలిసి ఢిల్లీకి వెళ్లినట్లు తెలిపారు.

### నీతి ఆయోగ్ సమావేశం నుంచి...

## మమతా బెనర్జీ వాకౌట్



న్యూఢిల్లీ జూలై, 27: ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో నీతి ఆయోగ్ సమావేశం మొదలయింది. అయితే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రసంగించడానికి తగినంత సమయాన్ని కేటాయించకపోవడానికి, సరైన వైఖరి పాటించనందున నిరసనగా ఆమె ఆ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. " చంద్రబాబు నాయుడుకు మాట్లాడటానికి 20 నిమిషాలు కేటాయించారు. ఇంకా అస్సాం, గోవా ముఖ్యమంత్రులు మాట్లాడటానికి 10 నుంచి 12 నిమిషాలు ఇచ్చారు. కానీ నేను ఐదు నిమిషాలు మాట్లాడక ముందే నన్ను నిలువరించారు. అందుకనే నేను ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాను" అని మమతా బెనరీ వివరించారు. ప్రధాని మోడీ నేతృత్వంలో నేడు రాష్ట్రపతి భవన్ లో నీతి ఆయోగ్ సమావేశం జరుగుతోంది.


### హైదరాబాద్‌కు నిధులు తీసుకరావడంలో...

## కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు విఫలం

హైదరాబాద్ జూలై, 27: భాగ్యనగరం అభివృద్ధికి ఇబ్బందులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశంసించారు. హైదరాబాద్‌కు రూ.10 వేల కోట్లు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు పొన్నం ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. గతంలో టూరిజం మంత్రిగా పని చేసిన కిషన్ రెడ్డి హైదరాబాద్‌కు ఒక్క రూపాయి తీసుకురాలేదని, గతంలో స్మార్ట్ సిటీ వస్తే కరీంనగర్‌కు ఇచ్చారని, హైదరాబాద్ నగర అభివృద్ధికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎన్ని నిధులు తీసుకవచ్చారో చెప్పాలని నిలదీశారు. హైదరాబాద్‌కు రూపాయి తీసుకురాలేని వాళ్లు కేంద్రమంత్రులుగా ఉండే అర్హత లేదని చురకలంటించారు. హైదరాబాద్‌కు నిధులు తీసుకరావడంలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు హైదరాబాద్ నగరానికి స్మార్ట్ సిటీ నిధులు తీసుకరావాలని పొన్నం డిమాండ్ చేశారు. విభజన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని స్పష్టం చేశారు. బలహీన వర్గాల రిజర్వేషన్లకు ఇబ్బందులు లేకుండానే పంచాయతీ ఎన్నికలకు వెళ్తామని వివరించారు. విహారయాత్రలకు వెళ్లినట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు బిఆర్ఎస్ నేతలు వెళ్లారని, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇచ్చి అల్టిమేటంకు ఎవరూ భయపడే ప్రసక్తే లేదన్నారు.




## ప్రత్యేక రాష్ట్రంలో పాలమూరుకు ఎక్కువ నష్టం జరిగింది: రేవంత్ రెడ్డి



హైదరాబాద్ జూలై, 27 : ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నష్టం కంటే ప్రత్యేక రాష్ట్రంలో పాలమూరుకు ఎక్కువ నష్టం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పాలమూరు జిల్లా ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఏం పాపం చేశారని అడిగారు. 2009లో పాలమూరులో పోటీ చేస్తే మహబూబ్‌నగర్ ప్రజలు భుజాన పెట్టుకొని గెలిపించారని గుర్తు చేశారు. బడ్జెట్ పై చర్చ సందర్భంగా రేవంత్ మీడియాతో మాట్లాడారు. రూ.20 లక్షల కోట్లు ఖర్చు చేసినా పాలమూరు ప్రాజెక్టులు ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు.

చేవెళ్ల ప్రాజెక్టును నిర్వీర్యం చేసి సిగ్గులేకుండా ఎలా మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, గొర్రెల పంపిణీ, కెసిఆర్ కిట్లపై విచారణకు సిద్ధమా? అని రేవంత్ సవాల్ విసిరారు. ఇప్పుడు కూడా బిఆర్ఎస్ నాయకులు ప్రజల్ని మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అవినీతే జరిగిందని, గొర్రెల స్కామ్, బతుకమ్మ చీరల్లోనూ అవినీతే బయటపడిందని విమర్శలు గుప్పించారు.




## హరీష్ రావు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు : భట్టి విక్రమార్క

హైదరాబాద్ జూలై, 27: మాటలతో అంకెల గారడితో బిఆర్ఎస్ గత పదేళ్ల నుంచి మోసం చేసిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను రూపొందించామని, బిఆర్ఎస్ నేతలు ప్రజలకు భ్రమలు కల్పిస్తున్నారని దుయ్యబట్టారు. శాసన సభలో బడ్జెట్ పద్దుపై చర్చ సందర్భంగా హరీష్ రావు కామెంట్స్ కు భట్టి రీకౌంటర్ ఇచ్చారు. బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, మా బడ్జెట్‌ను చూసిన తరువాత హరీష్‌రావు కంటగింపుగా మారిందని చురకలంటించారు. టానిక్ లాంటి షాపులు పెట్టి సర్కార్‌కి డబ్బులు రాకుండా చేశారని, కొన్ని కుటుంబాలకు వెళ్లేలా గత సర్కార్ చేసిందని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు.

### జూరాలకు భారీ వరద..

## శ్రీశైలం దిశగా కృష్ణమ్మ పరుగులు



శ్రీశైలం: జూరాల ప్రాజెక్టులోకి 3,02,000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి మాత్రం చేస్తున్నారు.. అదే విధంగా నెట్టెంపాడు, పార్లల్ కెనాల్ కోసం నీటిని విడుదల చేసారు. మొత్తం ప్రాజెక్టు నుంచి 44 గేట్లను ఎత్తి 3,16,308 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం వైపు దిగువకు విడుదల చేశారు. నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్ 1,300, కుడి 453, ఎడమ కాల్వలకు 820 క్యూసెక్కులతోపాటు విద్యుత్ ఉత్పత్తికి సరిపడా నీరు విడుదల చేసినట్లు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు అధికారులు శనివారం తెలిపారు. జూరాల ప్రాజెక్టు కేపాసిటీ 6.2 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటిమట్టం ల నీటి మట్టం ఈ రోజు సాయంత్ర 6 గంటలకు 4.033 టీఎంసీలుగా ఉంది.

### బోనాల పండుగకు పటిష్టమైన...

## భద్రతా ఏర్పాట్లు

### - సీపీ సుధీర్ బాబు



మల్కాజిగిరి జూలై, 27: బోనాల పండుగ సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రజల సహకారంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించాలని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు అధికారులను ఆదేశించారు. సున్నితమైన ప్రాంతాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, సమర్థవంతమైన సిబ్బందిని బందోబస్తులో ఉంచాలని సూచించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనే సామూహిక వేడుకల వంటి కార్యక్రమాల బందోబస్తు సమయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అన్ని ప్రముఖ దేవాలయ ప్రాంగణాల్లో వాహనాల నంబర్ ప్లేట్ల చెకింగ్, పత్రాల చెకింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రదేశాల్లో బాంబు తనిఖీ బృందాల ద్వారా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కల్లోలాలు రెచ్చగొట్టే పాత నేరస్తుల మీద నిఘా వేసి ఉంచాలని, వారు ఎటువంటి నేరాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### నీతి ఆయోగ్ మీటింగ్‌కు...

## 10 రాష్ట్రాల సిఎంలు డుమ్మా

న్యూఢిల్లీ జూలై, 27 : ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో దాదాపు 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పాల్గొనలేదని నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు మొత్తం 26 మంది సమావేశానికి హాజరయ్యారని విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ఆయన వెల్లడించారు. సమావేశానికి హాజరుకాని రాష్ట్రాలలో కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, బీహార్, ఢల్లీ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్, పుదుచ్చేరి (యుటి) ఉన్నాయని ఆయన తెలిపారు. సమావేశానికి హాజరుకాకపోవడం వల్ల వారికే నష్టమని కూడా ఆయన వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సమావేశం నుంచి వాకౌట్ చేయడం గురించి విలేకరులు ప్రశ్నించగా రాష్ట్రాల అక్షర క్రమంలో పశ్చిమ




బెంగాల్‌కు భోజన విరామం అనంతరం మాట్లాడే అవకాశం ఉన్నప్పటికీ మమతా బెనర్జీ అభ్యర్థనను మన్నించి ఆమెకు భోజన విరామానికి ముందే మాట్లాడే అవకాశం కల్పించామని సిఇఓ తెలిపారు. ఆమెకు ఇచ్చిన సమయం ముగియడంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కేవలం మైక్‌పై చిన్నగా కొట్టారని, వెంటనే ఆమె మాట్లాడడం నిలిపివేసి బయటకు వెళ్లిపోయారని ఆయన వివరించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అధికారులు మాత్రం సమావేశంలోనే కొనసాగారని ఆయన తెలిపారు. బీహార్ గురించి జవాబిస్తూ రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో నితీష్ కుమార్ నీతి ఆయోగ్ సమావేశానికి రాలేకపోయారని సిఇఓ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ సమావేశంలో చేసిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డిఐ) కోసం రాష్ట్రాలు పోటీపడాలని, దీని వల్ల పెట్టుబడులు అన్ని రాష్ట్రాలకు ముఖ్యంగా ఎక్కువ విజయం సాధించలేని రాష్ట్రాలకు చేరుతాయని మోడీ అన్నారని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ విలేకరులకు తెలిపారు. జనాభా నియంత్రణ, సున్నా పేదరికం భావన గురించి కూడా సమావేశంలో చర్చించినట్లు ఆయన తెలిపారు.

### హైద్రాబాద్‌కు మెట్రో రైలు

## నా వల్లే వచ్చింది

### : అక్బరుద్దీన్



హైదరాబాద్ జూలై, 27 : తెలంగాణ అసెంబ్లీలో నేడు ఎంఐఎం ఎంఎల్ఏ అక్బరుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైద్రాబాద్ కు మెట్రో కావాలని తానే డిమాండ్ చేశానని గుర్తు చేశారు. నాడు ముఖ్యమంత్రితో కలిసి ఢిల్లీకి కూడా వెళ్లినట్లు తెలిపారు. పోరాడి తెచ్చుకున్న మెట్రో రైలు సేవలు తన ప్రాంతానికే లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇంతకంటే ఘోరం ఇంకోటి ఉండదన్నారు. పాత బస్తీకి మెట్రో రైలు సేవలను విస్తరించాలని కోరారు.

## హైదరాబాద్ లో కొత్త వైరస్

# 'నోరో ' వ్యాప్తి




హైదరాబాద్: కరోనా వైరస్ నుంచి ఈ మధ్యనే తేరుకున్నామో లేదో మరో సరికొత్త వైరస్ హైదరాబాద్ లో వేగంగా వ్యాపస్తోంది. దానిని 'నోరో వైరస్' అంటున్నారు. ఈ వైరస్ పై జిహెచ్ఎంసి హెచ్చరికలు చేసింది. ఎక్స్ వేదికగా పలు సూచనలు చేసింది. నోరో వైరస్ లక్షణాలు: చలి జ్వరం, వాంతులు, విరేచనాలు, నీరసం, కడుపు నొప్పి, డీహైడ్రెషన్. దీని బారిన పడకుండా ఉండాలంటే చేతులను సబ్బుతో శుభ్రంగా కడుగుకోవాలి. కాచి చల్లార్చి, వడబోసిన నీరు త్రాగాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ప్రస్తుతం ఈ వైరస్ యాకుత్ పురా, మలక్ పేట్, డబీర్ పురా, పురానీ హవేలి, మొఘల్ పురా వంటి పలు ప్రాంతాలలో వ్యాపిస్తోంది. చాలా మంది ఆసుపత్రుల్లో చికిత్స కోసం చేరుతున్నారు కూడా!

## సరే.. తప్పు చేశాం...

# మీరూ చేస్తారా?



హైదరాబాద్: సరే మేం తప్పు చేశాం.. మీరూ అదే చేస్తారా? అదే చేస్తే ఈ సారి మేము అక్కడ కూర్చుంటాం, మీరు ఇక్కడ కూర్చుంటారు.. అని శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అనటంతో.. నిజం ఒప్పుకున్నారని సభలో సభ్యులు చెవుల్లో గొణుక్కున్నారు. అసలేం జరిగిందంటే, అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ జరుగుతున్న తరుణంలో రెండు నెలలుగా సంక్షేమ పెన్షన్ చెల్లింపుల్లో జాప్యంపై ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. జూన్ నుంచి 4 వేల పెన్షన్ చెల్లించటం లేదని, మరో రెండు రోజుల్లో ఆగస్టు నెల వస్తుందని గుర్తుచేశారు. ఇందుకు మంత్రి సీతక్క ధీటుగా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. 2020 జులై నెలలో పెన్షన్ ఇవ్వకుండా నెలరోజులు ఆలస్యం చేశారని, అప్పటి నుంచి ఒక నెల లేటవుతోంది. నా దగ్గర ఆన్ రికార్డు ఉంది, అధికారులు కూడా ఉన్నారని చెప్పారు..

**మీరెంత లేటు చేశారో రికార్డులు చూడండి..**

ఇంకోటి చేయూత, చేయూత అంటున్నారు. 2018లో ఎలక్షన్ మేనిఫెస్టోలో పెన్షన్ల వయస్సును 65 ఏళ్ల నుంచి 55 ఏళ్లకు కుదిస్తామన్నారు. మూడున్నర ఏళ్ల తరువాత అమలు చేశారు. ఇక ఉద్యోగాలు చేస్తూ 24 వేలు, 30 వేలు పెన్షన్లు తీసుకునే వారికి కూడా రెండు వేల పెన్షన్ వర్తింప జేశారు. సుమారు 5000 మందికి డబుల్ డబుల్ పెన్షన్లు ఇచ్చారు. అంతే కాదు, కార్పొరేషన్ చైర్మన్ గా ఉంటూ కూడా చైర్మన్ గా అలవెన్సులు తీసుకుంటూ ఆరు వేల పెన్షన్లు కూడా ఉన్నాయి. ఇవ్వన్నీ నిరూపిస్తా. అద్భుతంగా అబద్దాలను మా మీద ప్రచారం చేస్తున్నారు. మీరు ఉన్నప్పుడు కూడా పాలనలోనే 31వ తారీఖు, 16వ తారీఖు, 20 వ తారీఖు, 27 వ తారీఖున పెన్షన్లు ఇచ్చారు. 2014 నుంచి డేటా మొత్తం నా దగ్గర ఉంది. మీరేదో మీరు చెప్పేదో కరెక్టు చెప్పి, మిగితా వాళ్లంతా తప్పు, మేం తప్పా ఈ దేశాన్ని బాగా పరిపాలించేటోళ్లు లేరు, అందరు తప్పు అని మాట్లాడటం సరికాదు, హరిష్ రావు గారికి రికార్డులు ఇస్తా చూసుకోవాలని సీతక్క అన్నారు. ఇందుకు సమాధానంగా హరిష్ రావు మాట్లాడుతూ, వీరు ఎంత సేపూ మావి చెబుతున్నారు, మేం తప్పు చేశాం కాబట్టే ప్రతిపక్షంలో జనం కూర్చొబెట్టారు, మీరు అదే తప్పు చేస్తారా? అలా చేస్తే మీరు ఇక్కడికి వస్తారు, మేం అక్కడ కూర్చుంటాం అని అన్నారు.

# బెంగళూరు హంతకుడిని పట్టుకున్న పోలీసులు



బెంగళూరు: ఇటీవల కర్నాటక రాజధాని బెంగళూరులోని కోరమంగల లోని వెంకట్ రెడ్డి లేఅవుట్ లో కృతి కుమారి(24) అనే మహిళను మంగళవారం ఓ అగంతకుడు పొడిచి చంపాడు. ఆమె భీహార్ కు చెందిన మహిళ. పేయింగ్ గెస్ట్ హౌస్ లో ఉంటోంది. నిందితుడిని అభిషేక్(26) గా పోలీసులు గుర్తించారు. కాగా నిందితుడిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు బెంగళూరు సిటీ పోలీస్ కమిషనర్ బి. దయానంద తెలిపారు. నిందితుడిని మధ్యప్రదేశ్ కు చెందిన భోపాల్ లో అరెస్టు చేశారు. అతడిని బెంగళూరుకు తెచ్చి విచారించనున్నట్లు ఆగ్నేయం డిప్యూటీ పోలీస్ కమిషనర్ సరా ఫాతిమా తెలిపారు. హతురాలైన కృతి కుమారి కోరమంగళకు చెందిన వెంకటరెడ్డి లేఅవుట్ లోని భార్గవి స్టేయింగ్ హౌస్ లో ఉంటుండేది. హంతకుడు మూడో అంతస్తులో ఉన్న పిజిలోకి వెళ్లి ఆమెను అనేకసార్లు పొడిచి చంపేశాడు. అయితే అతడు ఆమెను ఎందుకు చంపాడన్న విషయం ఇంకా తెలియాల్సి ఉంది. హత్య జరిగాక అభిషేక్ తన ఫోన్ ని స్విచ్చాఫ్ చేసి భోపాల్ కు పారిపోయాడు. హత్య జరిగిన మూడు రోజులకు పోలీసులు అతడిని పట్టుకున్నారు.

# జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్‌లో ఓ సైనికుడి వీరమరణం

న్యూఢిల్లీ/శ్రీనగర్: జమ్ముకశ్మీర్ కుప్వారా జిల్లా కమ్‌కారీ సెక్టార్‌లో పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్ (బిఎటి) శనివారం జరిపిన దాడిని భారత ఆర్మీ భగ్నం చేసింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక సైనికుడు వీరమరణం పొందగా, కెప్టెన్‌తో సహా మరో నలుగురు ఆర్మీ జవాన్లు గాయపడ్డారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్ చొరబాటుదారుడు కూడా మృతి చెందినట్టు ఆర్మీ అధికారులు వెల్లడించారు. మరో ఇద్దరు పాక్ చొరబాటుదారులు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) లోకి పారిపోయారు. నాలుగు గంటల సేపు హోరాహోరీగా ఎన్‌కౌంటర్‌లో కాల్పులు జరిగాయి. ఉత్తరకశ్మీర్ జిల్లా త్రెహ్గామ్ సెక్టార్‌లో కుంకడి పోస్ట్ సమీపాన మొదట ముగ్గురు చొరబాటుదారులు గ్రెనేడ్ విసిరి, కాల్పులకు తెగబడ్డారని , వీటిని భారత ఆర్మీ దళాలు తిప్పి కొట్టాయని తరువాత ఇరు పక్షాల మధ్య ఎన్‌కౌంటర్ సాగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో భారత జవాన్లు ఐదుగురు తీవ్రంగా గాయపడగా, ఒకరు వీరమరణం పొందారని, పేర్కొన్నాయి. గాయపడిన కెప్టెన్‌తో సహా మొత్తం నలుగురిని బేస్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో



ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది.

# మహిళా నక్సలైట్ లొంగుబాటు



కబిర్ధామ్ (ఛత్తీస్‌గఢ్): మూడు రాష్ట్రాల్లో తనపై రూ.13 లక్షల రివార్డు ఉన్న మహిళా నక్సలైట్ హిడ్మె కొవాసి అలియాస్ రణిత (22) శనివారం కబిర్ధామ్ జిల్లాలో పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయింది. మావోయిస్ట్ ఎంఎంసి జోనల్ కమిటీ, గొండియారాజనందిగావ్ బాలఘాట్ (జిఆర్‌బి)డివిజన్స్ తండా/మలజ్‌ఖండ్ ఏరియా కమిటీ మెంబర్ (ఎసిఎం) అయిన ఆమె చాలా చురుకుగా నక్సల్స్ కార్యకలాపాలు సాగించినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో రూ.5 లక్షల వంతున, మధ్యప్రదేశ్‌లో రూ.3 లక్షల వంతున ఆమెపై రివార్డు ప్రకటించి ఉంది. సీనియర్ నక్సల్స్ సాగించిన అరాచకాలకు , శుష్క మావో సిద్ధాంతానికి విసుగెత్తి ఆయుధాలు విసర్జించినట్టు ఆమె చెప్పిందని అధికారులు పేర్కొన్నారు. ఆమెకు రూ. 25,000 వరకు ఆర్థిక సాయం అందుతుందని . రాష్ట్ర పునరావాస విధానం కింద ఇతన సౌకర్యాలు సమకూర్చడమవుతుందని చెప్పారు.

## నాడు సుప్రీం బహిష్కరించిన వ్యక్తి.. నేడు హోం మంత్రి :

# అమిత్‌షాకు పవార్ కౌంటర్



ముంబై : "రాజకీయాల్లో అవినీతికి రింగ్‌లీడర్" అని కేంద్రహోం మంత్రి అమిత్‌షా తనపై చేసిన వ్యాఖ్యలకు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధినేత శరద్‌పవార్ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. గతంలో ఓ కేసు విషయంలో గుజరాత్ నుంచి రెండేళ్లపాటు సుప్రీం కోర్టు బహిష్కరించిందని, అటువంటి వ్యక్తి దేశంలో అత్యంత ముఖ్యమైన హోం మంత్రిత్వశాఖకు మంత్రిగా ఉండడం విచిత్రం కలిగిస్తోందని శరద్ పవార్ తీవ్రంగా వ్యాఖ్యానించారు.

"కొన్ని రోజుల క్రితం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నాపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశంలోని అవినీతిపరులందరికీ కమాండర్ తానని వ్యాఖ్యానించారు. చట్టాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై గుజరాత్ నుంచి సుప్రీం కోర్టు రెండేళ్ల పాటు బహిష్కరించింది. అలాంటి వ్యక్తి ఇప్పుడు దేశానికి హోం మంత్రిగా ఉండడం నిజం విచిత్రంగా ఉంది. దీనిని బట్టి మనదేశం ఎలాంటి వారి చేతిలో ఉందో ఆలోచించుకోవాలి. లేకుంటే నూటికి నూరు శాతం వారు దేశాన్ని పొరపాటు మార్గంలో నడిపిస్తారు" అని వ్యాఖ్యానించారు.

"2010లో సొహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో అమిత్‌షా గుజరాత్ రాష్ట్రం నుంచి రెండేళ్లు సుప్రీం కోర్టు బహిష్కరణకు గురయ్యారు. తరువాత 2014లో నిర్దోషిగా విడుదలయ్యారు" అని పవార్ గుర్తు చేశారు. అంతకు ముందు జులై 21న పుణెలో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో శరద్ పవార్‌పై కేంద్రమంత్రి అమిత్ షా తీవ్రంగా విమర్శలు చేశారు. పాలపొడిని దిగుమతి సర్క్యులర్ రాష్ట్రంలో ప్రచారం కావడంపై విపక్షాల కూటమిని, మహావికాస్ అఘాడీ(ఎంవిఎ)ని కూడా విమర్శించారు. శరద్ పవార్ పార్టీ అధికారం లోకి వస్తే మరాఠా రిజర్వేషన్ అమలు కాకుండా పోతుందని, తాము అధికారం లోకి వచ్చేలా ఓటు వేస్తే మరాఠా రిజర్వేషన్ కొనసాగిస్తామని అమిత్‌షా హామీ ఇచ్చారు.

# "తప్పుడు కథనం"....

## మమతా బెనర్జీ మైక్-ఆఫ్ క్లెయిమ్‌పై నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ కీలక సమావేశంలో తన మైక్రోఫోన్ స్విచ్ ఆఫ్ అయిందని, కేవలం ఐదు నిమిషాలు మాత్రమే మాట్లాడేందుకు అనుమతించారంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'కథనాలను రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నారని' ఆరోపించారు. అబద్ధం". ముఖ్యమంత్రులందరికీ మాట్లాడటానికి "నిర్ణీత సమయం" కేటాయించబడిందని ఆర్థిక మంత్రి అన్నారు మరియు తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ కూడా సమావేశం నుండి బయటకు రావడానికి "సాకు కోసం వెతకడం" కంటే ఎక్కువసేపు మాట్లాడమని అభ్యర్థించవచ్చు. శనివారం జరిగిన నీతి ఆయోగ్ జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించని ఏకైక భారత ముఖ్యమంత్రి అయిన శ్రీమతి బెనర్జీ – "రాజకీయ వివక్ష" అని ఆరోపిస్తూ, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ఆమె సహచరులు కొందరు వచ్చినప్పుడు కేవలం ఐదు నిమిషాలు మాత్రమే మాట్లాడటానికి అనుమతించారని చెప్పారు. 15కి పైగా మాట్లాడండి. ఆమె మైక్రోఫోన్ ఆఫ్ చేయబడిందని మరియు తనకు కేటాయించిన సమయం ముగిసిందని గుర్తు చేయడానికి పదే పదే బెల్ మోగించబడిందని ఆమె చెప్పింది.

నీతి ఆయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరయ్యారు. మేమంతా ఆమె మాట విన్నాం. ప్రతి ముఖ్యమంత్రికి నిర్ణీత సమయం ఇచ్చారు, అది ప్రతి టేబుల్ ముందు ఉన్న స్క్రీన్‌పై ప్రదర్శించబడింది. ఆమె ఇప్పుడు మీడియా ద్వారా తెలియజేసింది. మైక్‌ను ఆఫ్ చేశారన్నది పూర్తిగా అబద్ధం" అని ఆర్థిక మంత్రి ఏఎన్ఐకి చెప్పారు. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారని, అయితే రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారని సీతారామన్ మాట్లాడుతూ, ఏదైనా ముఖ్యమంత్రికి కేటాయించిన సమయం ముగిసినప్పుడు, మిస్టర్ సింగ్ మైక్రోఫోన్‌ను ట్యాప్ చేశారని చెప్పారు. "ఇది అందరు ముఖ్యమంత్రుల కోసం జరిగింది, కానీ బెనర్జీ తన మైక్ స్విచ్ ఆఫ్ చేయబడిందని చెప్పడం దురదృష్టకరం, ఇది నిజం కాదు. ఇది దురదృష్టకరం ఎందుకంటే ఆమె ఈ సమావేశంలో పాల్గొనడం, తన వాదనను వినిపించడం, పశ్చిమ బెంగాల్ కోసం మాట్లాడటం మాకు సంతోషంగా ఉంది. మరియు, ఆమె సమావేశంలో చెప్పినట్లుగా, అన్ని విపక్షాల కోసం మాట్లాడారు, "అని ఆర్థిక మంత్రి అన్నారు. "విధానం ప్రకారం, మైక్ ఆన్‌లో ఉన్నప్పటికీ, ఆమె సమయం ముగిసిందని ఆమెకు గుర్తు చేస్తే, మరికొందరు ముఖ్యమంత్రులు మాట్లాడినట్లుగా, ఆమె మాట్లాడటం కొనసాగించాలనుకుంటున్నట్లు ఆమె అభ్యర్థించవచ్చు. , కానీ ఆమె దానిని ఒక సాకుగా ఎంచుకుంది, తద్వారా ఆమె మీటింగ్ నుండి బయటపడవచ్చు, ఆపై మైక్ స్విచ్ ఆఫ్ చేయబడింది అని చెప్పడం చాలా దురదృష్టకరం, ఆమె దీని వెనుక ఉన్న నిజాన్ని మళ్లీ నిర్మించాలని నేను కోరుకుంటున్నాను అబద్ధం ఆధారంగా కథనం, "ఆమె జోడించారు.

బెనర్జీపై ఆరోపించిన వివక్షను నీతి ఆయోగ్ సమావేశాలను ఒక ప్రహసనంగా పిలిచిన కాంగ్రెస్ జైరామ్ రమేష్‌తో సహా భారత కూటమిలోని ఆమె సహచరులు కొందరు కూడా తీసుకున్నారు.

# యుఎస్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నా: కమలా హారిస్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తూ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ పత్రాలపై సంతకం చేశారు. ప్రజల బలంతో తాను చేసే ప్రచారం నవంబర్‌లో గెలిపిస్తుందని కమల హామీ ఇచ్చారు. నవంబర్‌లో ప్రజల బలంతో కూడిన ప్రచారంతో గెలుస్తానని కమలా హ్యారిస్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ధీమా వ్యక్తం చేశారు. ప్రతి వోటు సంపాదించేందుకు తాను బాగా కష్టపడతానని కూడా ఆమె ఉద్ఘాటించారు. 'అమెరికా అధ్యక్ష పదవికి నా అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటిస్తూ పత్రాలపై సంతకం చేశాను. ప్రతి వోటు సాధించేందుకు బాగా శ్రమిస్తాను. నవంబర్‌లో ప్రజల శక్తితో కూడిన మా ప్రచారం గెలుస్తుంది' అని కమలా హ్యారిస్ తన పోస్ట్‌లో తెలిపారు. నవంబర్ 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ డెమోక్రాటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తారు. ఆమె అభ్యర్థిత్వాన్ని జో బైడెన్ ఆమోదించారు.


## సంపాదకీయం

ఆదివారం, జూలై 28, 2024

# రైతు 'పంట' పండించిన బడ్జెట్..!

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి బడ్జెట్‌లో రైతుకు, వ్యవసాయానికి పట్టం కట్టింది. కొత్త సంక్షేమ పథకాలు ఏవీ లేవని బడ్జెట్‌పై చర్చలో కేసీఆర్ విమర్శలు గుప్పించినప్పటికీ ఇది రైతు పంట పండించనున్న బడ్జెట్‌గా చెప్పాలి. వ్యవసాయశాఖకు భారీగా రూ.72,659 కోట్లు కేటాయించగా, రూ.2లక్షల రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లను అదనంగా కేటాయించారు. తొలిసారిగా రైతు కూలీలకు కూడా పట్టాలతో సంబంధం లేకుండా ఏడాదికి 12 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పడం ముదావహం. అలాగే రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లను కేటాయించి మంత్రి నివ్వెరపరిచారు. సంక్షేమానికి రూ.40 వేల కోట్లు కేటాయించారు. దీంతో అప్పుల చెల్లింపుతో పాటు ప్రజా ప్రయోజనాలకు కూడా భారీగా వ్యయం చేయనున్నట్లు రాష్ట్ర బడ్జెట్ పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. మొత్తం బడ్జెట్ వాల్యూ 2,91,159 లక్షల కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు, మూలధనం వ్యయం రూ.33,487 కోట్లుగా ఉంది. ఈ క్రమంలో వ్యవసాయశాఖకు భారీగా రూ.72,659 కోట్లు, సంక్షేమానికి రూ.40 వేల కోట్లు, సాగునీటి రంగానికి రూ.26 వేల కోట్లు కేటాయించారు. ఇవే కాకుండా పంచాయతీరాజ్ శాఖకు రూ.29, 816 కోట్లు, విద్యాశాఖకు రూ.21,292 కోట్లు, వైద్యారోగ్య శాఖకు రూ.11, 468 కోట్లు. ఎస్టీ సంక్షేమానికి రూ.17,056 కోట్లు. ఎస్సీ సంక్షేమానికి రూ. 33,124 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.9200 కోట్లు, ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు, మొత్తం హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు రూ.1500 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. మొత్తం రూ.72,659 కోట్లను రైతాంగానికి కేటాయించింది. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలకు ఆ నిధులను వినియోగించనుంది. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యానవన పంటలు, ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇప్పటికే రుణమాఫీ తొలివిడతలో లక్ష వరకు రుణాలు ఉన్న అన్నదాతల అకౌంట్లలో నగదు జమ చేసిన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోపు 2 లక్షల మేర రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేసింది. అలాగే తాము ఇస్తానన్న 15 వేల రైతు భరోసా పథకాన్ని అమలు చేసే విధంగా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. ఈ పథకానికి మార్గదర్శకాలు ఎలా ఉండాలనేది ఈ బడ్జెట్ సమావేశాల్లోనే.. చర్చించి తుది నిర్ణయం తీసుకుని అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో చివరి రైతు వరకు సంక్షేమ ఫలాలు అందలనేదే సర్కార్ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక భద్రత కరువై పని దొరకని రోజుల్లో రైతు కూలీలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పట్టాలు ఉన్న రైతులకే భరోసా నిచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టాలు లేని పేద రైతులను గాలికొదిలేసింది. వారందరినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టబోతోంది. రైతు కూలీల ఆర్థిక, జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు అందిచనున్నట్లు పేర్కొంది. ఈ పథకానికి కూడా ఈ సంవత్సరంలోనే శ్రీకారం చుట్టుబోతున్నట్లుగా మంత్రి ప్రకటించారు. అయితే దేశ చరిత్రలో భూమి లేని పేద రైతులకు నగదు పంపిణీ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అప్పులు పది రెట్లు పెరిగాయి తప్ప తెలంగాణ ఆకాంక్షలు తీరలేదని బడ్జెట్ సమర్పణ సందర్భంగా ఆర్థికమంత్రి ప్రకటించారు. బంగారు తెలంగాణ చేస్తామని అప్పుల తెలంగాణను మిగిల్చారని ఆరోపించారు. కోట్లాది ప్రజల ఆశల మేరకు ఉద్యోగాలు, నీళ్లు దక్కకపోగా ఒంటెద్దు పోకడలతో ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేశారని, అప్పుల పెరగడంతో పాటు బిల్లుల బకాయిలు భారీగా పెరిగాయని మంత్రి తెలిపారు. కొత్త ఉద్యోగాలు సృష్టించడానికి బదులు ఉన్న ఉద్యోగాలను కూడా ఇవ్వలేదని, జీతాలు పెన్షన్ చెల్లింపులు సైతం చేయలేని దుస్థితి ఏర్పడిందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ పరిస్థితుల్లో పదేళ్ల తర్వాత వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టామని మంత్రి చెప్పుకొచ్చారు. అయితే ఆరు గ్యారెంటీల అమలు విషయంలోనే మల్లగుల్లాలు పడుతున్న ప్రభుత్వం వాటితోపాటు ప్రకటించిన భారీ స్థాయి నజరాలను ఎలా చెల్లిస్తుందనేదే అసలు సమస్య. కేంద్ర సహాయంపై ఆశలు కూడా ఆవిరవుతున్న వేళ.. కాంగ్రెస్ ప్రభుత్వ తొలి బడ్జెట్ సాహసోపేతమైన ప్రకటన అనే చెప్పాల్సి ఉంటుంది. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఆసరా పెన్షన్ల పెంపు, విద్యా భరోసా కార్డు, జాబ్ క్యాలెండర్ వంటి గుదిబండలను దాటుకుని రాష్ట్ర ప్రభుత్వం తన హామీలన్నింటినీ క్రమంగా నెరవేరుస్తుందని ఆశిద్దాం.

# భారత ఖ్యాతిని చాటిన కలామ్.....



అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన. ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన జీవితం ఆదర్శం. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకోవడం గొప్పతనం. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన కలాం. హార్ట్ స్టంట్ రూపొందించడం లోనూ పాత్ర పోషించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఆయన జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటారు. అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం లో ఒక ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15న జన్మించాడు. తండ్రి పేరు జైనలబుద్దీన్ మరాకాయర్, తల్లి పేరు అషియమ్మా జైనబుల్బుద్దీన్. అబ్దుల్ కలాం పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబానికి సహాయం చేయడానికి చిన్న వయసు లోనే న్యూస్ పేపర్లు వేసేవాడు. రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉన్న రామనాథపురంలో స్కెచ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో పదో తరగతి వరకు చదువు కున్నాడు. చదువు అంత అంత మాత్రమే అయినప్పటికీ నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉండేది. స్కూల్లోనే ఉపాధ్యాయుడు ఒకసారి సముద్రపు ఒడ్డుకు తీసుకువెళ్లి పక్షి ఎలా ఎగురుతుందో చూపించాడు. అప్పటి నుండి కలాం కూడా పక్షిలా ఎగరాలను కున్నాడట. ఎలాగైనా పైలెట్ కావాలని అనుకున్నాడు. తరువాత తిరుచ్చిలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. కలాం తన చిన్ననాటి కోరిక నిజం చేసు కోవడానికి మద్రాసులోని ఎన్ఐటీల్లో చేరాడు. ఐతే ఇన్స్టిట్యూట్ లో చేరాలంటే వెయ్యి రూపాయలు ఫీజు కట్టాల్సి వచ్చింది. కానీ ఆయన తండ్రి దగ్గర లేనపుడు కలాం అక్క తన రెండు గాజులు అమ్మి ఫీజ్ కట్టింది. ఎలాగైనా బాగా చదివించాలని ఉన్నతమైన స్థానంలో చూడాలని తన కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాన్ని తన మీద వాళ్లకు నమ్మకాన్ని చూసి చలించి పోయాడు. చివరకు స్కాలర్షిప్ సహాయంతో ఎం ఐ టి లో ఎరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, అందులో నాటికల్ ప్రవేశ పరీక్షల్లో 8 ఉద్యోగాలు ఉంటే తనకు 9వ స్థానం రావడంతో తృటిలో పైలెట్ అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. కలాం తన చిన్ననాటి కల చేజారి పోయింది. 1960 కలాం డీఆర్డీఓ (%ఔ=ఔూ%)లో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో శాస్త్రవేత్తగా చేరారు. అక్కడ భారత సైన్యం కోసం ఒక ఓవర్ క్రాఫ్ట్ డెవలప్ చేయడం ఆయన పని. కొన్ని రోజులకి ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ నుండి కలాం కి ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది. ఇప్పుడు దీనినే ఇస్రోగా (%×ూ=ా%) పిలుస్తున్నారు. ప్రొఫెసర్ విక్రం సారాభాయ్ ఇంటర్వ్యూ చేశారు. అలా కలాం రాకెట్ ఇంజినీరుగా సెలక్ట్ అయ్యారు. విక్రం సారాభాయ్, కలాం కలిసి ఇస్రో ను ఎంతగానో అభివృద్ధి చేశారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (%ూాఎ-×××%)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. క్రమంలో ఆరు నెలలపాటు రాకెట్ లాంచింగ్ టెక్నిక్ మీద ట్రైనింగ్ కోసం అమెరికాలోని "నాసా" వెళ్లే అవకాశం దక్కింది. భారత్ నుండి అంతరిక్షంలోకి శాటిలైట్ పంపాలనేది ప్రొఫెసర్ సారాభాయ్ కోరిక. శిక్షణ పూర్తి అయిన తర్వాత కలాం... సారాభాయ్ మరియు సతీష్ సహకారంతో "రోహిణి" అనే శాటిలైట్ ని అంతరిక్షంలోకి పంపడానికి ఎస్ఎల్వి-3 అనే రాకెట్ ని అభివృద్ధి చేశారు. దేశంలోని ప్రజలందరికీ ఎస్ఎల్వి-3 మీదే కళ్ళు ఉన్నాయి. కలాంతో పాటుగా అక్కడ ఉన్న ఎంతోమంది కష్టపడి నిర్మించిన 22 మీటర్ల పొడవైన ఎస్ఎల్వి-3 లాంచ్ అయింది. 315 సెకండ్ తర్వాత సెకండ్ స్టేజ్ పేలిపోయి సముద్రంలో కుప్పకూలి పోయింది. కలాంకు ఏదో తెలియని ఆవేదన. దేశ ప్రజల అందరి కళ్లు ఆవిరై పోయాయి. మళ్ళి తిరిగి 1980 2 వ ఎస్ఎల్వి-3 రెడీ చేశారు. మొదటి దాని లాగానే ఇది కూడా ఫెయిల్ అవుతుందని వ్యాఖ్యానించారు. 18 జూలై 1980 లో ఎస్ఎల్వి-3 రోహిణి విజయ వంతంగా ప్రవేశ పెట్టింది..అంతరిక్షం లోకి శాటిలైట్ ని పంపగలిగే కెపాసిటీ ఉన్న దేశాల లిస్టులో భారతదేశం కూడా చేరింది. భారత అంతరిక్ష ప్రయోగాలు పునాదులు పడ్డాయి. ఆ నాటి ప్రధానమంత్రి గాంధీ ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాతి సంవత్సరం 1981లో కలాంకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆ తరవాత మన ఆర్మీ కోసం అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్ వంటి శక్తివంతమైన మిస్సైల్ లు తయారు చేసి మన దేశాన్ని ఎవరి మీద ఆధారపడని ఒక శక్తివంతమైన దేశంగా మార్చారు. అందుకే కలాంను మిసైల్ మాన్ అంటారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ఎంతో అభివృద్ధి చెందింది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి, క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హెూదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-%××% అణుపరీక్షలు విజయ వంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగ స్వామిగా ఆయన్ను "మిస్సైల్ మాన్" అని పిలుస్తారు. 1898లో వాజ్ పేయి ప్రధానమంత్రి సమయంలో అమెరికన్ శాటిలైట్స్ కి దొరకకుండా "పోక్రాన్" అనే ప్రదేశంలో "ఆపరేషన్ శక్తి" అనే పేరుతో విజయవంతంగా న్యూక్లియర్ టెస్ట్ చేయడంలో కలాం పాత్ర ఎంతగానో వుంది. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగు పెట్టారు. ఆయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాం మన దేశానికి ఏ రాజకీయ అనుభవం లేకుండా పదకొండవ రాష్ట్రపతిగా ఎన్నికైన జ్ఞాని. కలాం సమయంలో ఎక్కవ మందిని కలుసుకున్న రాష్ట్రపతిగా, పీపుల్స్ ప్రెసిడెంట్ అని అంటారు. అబ్దుల్ కలాం గారు పెళ్లి చేసుకోలేదు. అంతేకాదు, వైద్య రంగంలో పోలియో బాధితుల కోసం, తేలికపాటి పరికరాల రూపకల్పన చేయడానికి ఎంతో కృషి చేశారు. భారత ప్రభుత్వం "భారతరత్న" "పద్మవిభూషణ్", "పద్మభూషణ్" పురస్కారాలతో గౌరవించింది. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. మత ఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరు గడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. 84 సంవత్సరాల వయసులో జూలై 27, 2015 సోమవారం సాయంత్రం షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం మధ్యలో కుప్పకూలి పోయి, స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించబడి, 45 నిమిషాల వ్యవధిలోనే కన్నుమూశారు.

# అనితర సాధ్యాలు సంగం లక్ష్మీబాయి సేవలు



తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళలను ముందుండి నడిపించిన ధీర వనిత ఆమె. బాలికల, స్త్రీల సంక్షేమం కోసం నిరంతరం తపించి, జీవితాంతం చిత్తశుద్ధితో పాటుపడిన సేవా నిరతికి ప్రతిరూపం ఆమె. స్వాతంత్ర్య సమర యోధురాలుగా తామ్రపత్ర గ్రహీత ఆమె. శాసన సభ్యురాలిగా, విద్యా మంత్రిణిగా, ఆంధ్రప్రదేశ్ సామాజిక, సంక్షేమ సలహా బోర్డు కోశాధికారిణిగా, హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగం కన్వీనర్‌గా, ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా, అంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బాధ్యు రాలిగా సమర్థ వంతంగా పనిచేసి, ప్రశంసలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె. ఆమే ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యురాలైన తొలి మహిళగా గుర్తింపు పొందిన సంగం లక్ష్మీబాయి. సంగం లక్ష్మీబాయి (జూలై 27, 1911 - జూన్ 3, 1979) 1911, జూలై 27 న ఘటకేసర్ సమీపం లోని ఒక కుగ్రామంలో జన్మించారు. బాల్యం లోనే తల్లిదండ్రులు, చిన్నతనం లోనే వివాహమై భర్త చని పోవడంతో ఆమె అనాథ అయ్యారు. చాలా చురుకైన బాలిక కావడంతో మద్రాసు ఆంధ్ర మహిళా సభలో చదువుకునే అవకాశం లభ్యమైంది. కార్వే విశ్వ విద్యాలయం, ఉన్నవ లక్ష్మీ బాయమ్మ ప్రారంభించిన శారదా నికేతన్, మద్రాసు ఆర్ట్స్ కళాశాలలో చదువు కున్నారు. అక్కడ ఉన్నత చదువుల అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. నారాయణ గూడలో ఉన్న రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఉమెన్స్ కాలేజ్ హాస్టల్ బాధ్యతలు చూసు కుంటూనే మరోవైపు స్వాతంత్ర్యో ద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎంతోమంది మహిళలను ఉద్యమాల్లో భాగస్వాములను చేశారు. ఆమె సాంఘిక సేవలోనే పూర్తి సమయం వెచ్చించి ఆ తర్వాత రాజకీయాలలో చేరారు. ఆమె విద్యార్థిగా ఉన్న రోజులలో సైమన్ కమీషన్ ను వ్యతిరేకించారు. ఉప్పు సత్యాగ్రహం (1930-31) లో క్రియాశీలంగా పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు. స్వామి రామానందతీర్థ ఆధ్వర్యంలో సాగిన నిజాం వ్యతిరేక ఉద్యమంలో ముఖ్య పాత్ర వహించారు. 1932లో శాసనోల్లంఘనలో పాల్గొని అరెస్ట్ అయి రాయవెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. ఆమె వినోభా భావే యొక్క తొలి పాద యాత్రకు తెలంగాణలో సారథ్యం వహించారు. 1950లో భూదానో ద్యమ యాత్ర కోసం తెలంగాణకు వచ్చిన ఆచార్య వినోబా బావే ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించారు. ఆయన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు 16 గ్రామాలు తిరిగి 314 ఎకరాల భూమిని సేకరించారు. 1947-48లో తెలంగాణ విమోచనో ద్యమం లోనూ పాల్గొన్నారు. విమోచన అనంతరం సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆమె 1952 లో నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. బూర్గుల రామకృష్ణారావు కేబినెట్‌లో విద్యాశాఖ సహాయ మంత్రిగా 1954 నుంచి 1956 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె హయాంలోనే తెలంగాణ జిల్లాల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు ప్రారంభమయ్యాయి. మంత్రిగా సంపాదన మొత్తాన్ని స్త్రీ సేవాసదన్‌కు ఉపయోగించారు. 1955లో దాన్ని తన సహచరులైన కేవీ రంగారెడ్డి, ఎ.శ్యామలాదేవి, పి.లలితాదేవి, పాశం పాపయ్య, ఎం.భోజ్‌రెడ్డితో కలిసి ఇందిరా సేవా సదన్‌గా రిజిస్టర్ చేయించారు.


# మానుకోట తహశీల్దార్ కార్యాలయంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న ధృవపత్రాలను రిజెక్ట్ చేస్తున్న ఓ మహిళా అధికారి

**- విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు**

**- విద్యార్థులకు కులం ఆదాయం సర్టిఫికెట్లు త్వరగా అధికారులు అందించాలి**

**- లేనియెడల విద్యార్థులందరినీ ఏకం చేసి భారీ ఎత్తున ఉద్యమిస్తాం**

**- పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్**




**మహబూబాబాద్, జూలై 27:** మహబూబాబాద్ జిల్లాలో మండల తహశీల్దార్ కు రెవెన్యూ సర్టిఫికెట్ల కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ ఆలస్యం చేయకుండా త్వరగా సర్టిఫికెట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మానుకోట తహశీల్దార్ కార్యాలయంలో విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించే మహిళా అధికారి ధ్రువీకరణ పత్రాల విషయంలో ఇష్టానుసారంగా దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలు రిజెక్ట్ చేస్తుంది. ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం కళాశాలలో, వివిధ గురుకుల పాఠశాలల్లో సీట్లు వచ్చిన విద్యార్థులకు కులం, ఆదాయం,నివాస ధ్రువీకరణ పత్రాలు అవసరం పడతాయని, కళాశాలలో, పాఠశాలలో చేరుతున్న విద్యార్థులకు ఈ సర్టిఫికెట్లు ఆలస్యం అయితే సీట్లు పొందుటకు అవకాశం లేకుండా పోతుందని,సర్టిఫికెట్లు పొందటం ఆలస్యం అవడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మానసిక భయాందోళనకు గురవుతారని, తక్షణమే దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి వెంటనే వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని లేనియెడల పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో విద్యార్థులందరినీ ఏకం చేసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.



# కేక పుట్టిస్తున్నబేబమ్మ...



తొలి సినిమా బ్లాక్ బస్టర్ హిట్ పడినా ఆ క్రేజ్ ని వాడుకోలేక ప్రస్తుతం కెరీర్ లో కాస్త వెనుకబడి నట్టు అనిపిస్తుంది బేబమ్మ కృతి శెట్టి. మొదటి సినిమా ఉప్పెనతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న అమ్మడు ఆ క్రేజ్ తో అరడజను సినిమాల దాకా ఛాన్సులు అందుకోగా వాటిని వెంటనే వెంటనే చేసేసింది. అయితే అవి పూర్తయ్యాక కానీ తన తప్పు తెలుసుకోలేదు కృతి శెట్టి. ఐతే ఇప్పుడు కథల విషయంలో ఆచి తూచి అడుగులేయాలని అనుకుంటున్నా ఛాన్సులు లేక సతమతమవుతుంది. అందుకే తన ఫోకస్ అంతా తమిళ పరిశ్రమ మీద పెట్టింది అమ్మడు. అక్కడ రెండు సినిమాల్లో నటిస్తున్న కృతి శెట్టి మలయాళంలో కూడా టోవినో థామస్ తో జత కడుతుంది. ఐతే తెలుగులో మళ్లీ తిరిగి ఫాంలోకి రావాలని చూస్తున్న కృతి శెట్టి ఫ్రీ టైం లో ఫోటో షూట్స్ తో ఆడియన్స్ ని బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు షేర్ చేసిన రెడ్ కలర్ శారీ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఎర్ర కోకలో అందాల భామ బంగారు పాపలా దగ దగ మెరిసిపోతుంది. ఆ శారీకి తగినట్టుగానే మెడ చుట్టూ ఒక బ్లూ కలర్ రాళ్ల చెయి. వాటికి మ్యాచ్ అయ్యేలా చెవి జుంకీలు అబ్బో బేబమ్మని చూస్తే కుర్రాళ్లు డిస్టబ్ అవ్వడం మాత్రం ఖాయం. కట్టింది శారీనే అయినా తన ఓర కళ్లతో ఫాలోవర్స్ హృదయాలను గిలిగింతలు పెడుతుంది కృతి శెట్టి. ఈమధ్య ఫోటో షూట్స్ లో కాస్త గ్లామర్ డోస్ పెంచినట్టు కనిపిస్తుండగా ఎలాగైనా టాలీవుడ్ లో తిరిగి ఛాన్సులు అందుకోవాలని చూస్తుంది.

# చీరకట్టుతో మనసు దోచుకుంటున్న మౌని...



బుల్లితెర నుంచి వెండితెరకు ప్రమోట్ అయిన బోల్డ్ బ్యూటీగా మౌనీరాయ్ కి గుర్తింపు ఉంది. ఈ భామ ఆరంభం టీవీ స్క్రీన్లపై ఎంత పద్ధతిగా కనిపించిందో ఆ తర్వాత సినీనటి అయ్యాక అంత బోల్డ్ గా మారిపోయింది. తెరను బట్టి అవసరాన్ని బట్టి గ్లామర్ ని ఎలివేట్ చేయడం ప్రారంభించింది. ఇటీవల హాటెస్ట్ ఫోటో షూట్లతో మౌని మతులు చెడగొడుతోంది. తాజాగా మరోసారి మౌని తనదైన శైలిలో చెలరేగింది. ఈసారి చీరలో సింగారం ప్రదర్శించింది. స్లీవ్ లెస్ బ్లౌజ్ - చీరకట్టుతో మతులు చెడగొట్టింది. మౌని తెల్ల చీర- రవికె, కాంబినేషన్ గాజులతో మైండ్ బ్లాంక్ అయ్యే ట్రీటిచ్చింది. అలా శిరోజాలు విరబూసి కొత్త లోకంలోకి తీసుకెళ్లింది. మౌని రకరకాల భంగిమల్లో ఫోజులివ్వగా, వాటిలో కొన్ని పోటోల్లో మౌని తెల్ల చీరలో తళతళా మెరిసిపోతోంది కానీ అక్కడ మట్టి అంటినట్టు కనిపించలేదు. దీనిని బట్టి ఆ గాజు అద్దాల్లోనే ఆర్ట్ అంతా దాగి ఉందని అర్థం చేసుకోవాల్సి వస్తోంది. మాయదారి మౌని ఆ వివరం ఏమిటో స్పష్టంగా ఇప్పటికైనా చెబుతుందా లేదా? అంటూ యూత్ ప్రశ్నిస్తున్నారు.

# "డబుల్ ఇస్మార్ట్"

## డిజిటల్ పార్ట్ నర్ ఫిక్స్




డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డబుల్ ఇస్మార్ట్'. ఈ మూవీని ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. కాగా తాజాగా ఈ సినిమాకి సంబంధించిన OTT రైట్స్ పై క్లారిటీ వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అయిన అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. కేవలం ఈ సినిమా సౌత్ లాంగ్వేజ్ రైట్స్ 33 కోట్లకు సొంతం చేసుకుంది. హిందీ OTT రైట్స్‌పై క్లారిటీ రావాల్సి ఉంది. గతంలో సూపర్ హిట్ సాధించిన ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్ గా తెరకెక్కుతున్న ఇక ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ నటుడు సంజయ్ దత్ నెగెటివ్ రోల్ లో నటిస్తున్నారు. ఇక కావ్య థాపర్ హీరోయిన్ గా నటిస్తుండగా.. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందించిన ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.